ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 25-6-95

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

మానవునిలో ఉన్న బలహీనత అనుకరణ. ఒకడు ఏపని చేస్తే రెండోవాడు అదే పని చేయటం. అనుకరణ వద్దు. వివేకము చాలా ముఖ్యము వివేకము లేకపోతే, ఎంతోకొంత త్యాగము లేకపోతే జీవలక్షణాలు తగ్గవు. జీవలక్షణాలు తగ్గితేనేగాని ప్రకృతిని దాటి వెళ్ళలేము. ఏ మార్గమును అనుసరించినప్పటికి ప్రకృతి గుణాలను దాటి వెళ్ళాలి. ప్రకృతిని దాటిన తరువాత ఎవరైనా ఒకటే. ప్రకృతిని దాటితే ఉన్నది బ్రహ్మమే. అందువలన అదే మనకు అనుభవంలోనికి వస్తుంది.

సాధన గురించి ఆచార్యులవారు చెప్పిన మాటలు... సాధన లేకపోతే ప్రకృతి గుణాలను దాటివెళ్ళలేము బహుజన్మల కృషి ఉంటేగాని ప్రకృతి గుణాలను అతిక్రమించలేము అని కృష్ణుడు చెప్పాడు ప్రకృతి గుణాలను దాటితే ఉన్నది ఒకటే. అక్కడ బేధం లేదు. సిద్ధస్థితికి వచ్చాక బేధం లేదు. సాధనలోనే ఒకరు ఒక మార్గము, ఒకరు వేరే మార్గము అనుసరించవచ్చును.

ఆచార్యులవారు చెప్పినది అద్వైత సిద్ధాంతము. అది సిద్ధాంతము కాదు. అది ఒక సత్యము. అది అందరి హృదయములలోనూ ఉంది. అది అనుభవంలోనికి వస్తే అదే కడసారిజన్మ. ఇంక వాడికి జన్మలు రావు.

మనం అంతా ఇక్కడ కూర్చున్నాము. విషయములను శ్రవణంచేస్తున్నాము. దీనివలన ప్రయోజనం ఏమిటి అని తెలియనివారు అనుకోవచ్చును. ప్రతీమనిషికి శారీరక అవసరాలు, మానసిక అవసరాలు ఉంటాయి. ఇక్కడ మనం చెప్పుకొనే విషయములు మనిషి యొక్క మానసిక అవసరాలను చాలామటుకు తీరుస్తాయి. ఒక్క శారీరక అవసరాలు తీరినంత మాత్రము చేత మనిషి జీవించలేడు. తిండి, బట్ట దొరికినంత మాత్రము చేత మనిషి సుఖంగా జీవిస్తున్నాడా అంటే లేదు. ప్రతీమనిషికి మానసిక అవసరాలు ఉంటాయి. ఇక్కడ మనం చెప్పుకొనేవిషయములు మనిషియొక్క మానసిక అవసరాలు తీర్చటానికి ఉపయోగపడుతుంది దీనివలన టెన్షన్ తగ్గుతుంది, ఆలోచనాశక్తి పెరుగుతుంది, వివేకము పెరుగుతుంది. మరణానంతర జీవితము మాట అటు ఉంచండి. భౌతికంగా ఆలోచించినా దీనివలన ప్రయోజనం ఉంది.

ప్రతీ మనిషికి రెండు శరీరములు ఉంటాయి. 1. స్థూల శరీరము, 2. సూక్ష్మ శరీరము, స్థూల శరీరము మరణించటానికి మన ప్రయత్నము ఏమీ అక్కరలేదు ప్రారబ్ధము ప్రకారము ఈ భూమి మీద ఎంత కాలము తిరగాలో అంతకాలము తిరిగి అది మరణిస్తుంది. లోపల ఉన్న సూక్ష్మ శరీరము మరణించటానికి మనం ప్రయత్నం చేయాలి సూక్ష్మ శరీరము అంటే మనస్సు. ఇందులో మన కోరికలు, ఆశయాలు, వాసనలు, తలంపులు అన్నీ ఉన్నాయి. స్థూల దేహమునకు మరణం రావటంవలన పునర్జన్మ లేని స్థితికి ఎదగలేము. సూక్ష్మ దేహమునకు మరణంవస్తే మనం పునర్జన్మలేని స్థితికి ఎదుగుతాము అంటే మోక్షస్థితికి చేరతాము.

సూక్ష్మదేహము మరణించటానికే సాధన. శ్రవణాలు, గురువును ఆశ్రయించటం ఇవి అన్నీ కూడా

మనసు హృదయం లో ఉంచడమే భగవంతునికి పెట్టే నిజమైన నమస్కారం.

సూక్ష్మదేహము మరణించటానికే. స్థూలదేహము ఉండగా సూక్ష్మదేహమునకు మరణంవస్తే వాడిని జీవన్ముక్తుడు అంటారు. రమణమహర్షి, ఆచార్యుల వారు, బుద్ధుడు ఆ స్థితిని పొందారు అని చెపుతారు జీవన్ముక్తస్థితిని పొందిన వాడు మాత్రమే ఆ స్థితి గురించి సరిగా చెప్పగలడు. లేకపోతే Confusionవస్తుంది. వాడు కంగారు పడతాడు, ఇతరులను కంగారు పెడతాడు. వాడికే అనుభవంలేనపుడు తప్పనిసరిగా పొరపాటు మాటలు వస్తాయి.

పునర్జన్మ లేని స్థితికి ఎదగాలంటే సూక్ష్మ శరీరము burnఅవ్వాలి. అదిburn అవ్వాలంటే జ్ఞానం కావాలి. జ్ఞానం సంపాదించటానికే సాధన.

సాధ్యమైనంతవరకూ ఎదుటివారిని హింస పెట్టకుండా ఉండాలి. ఆధ్యాత్మికంగా అభివృద్ధి లోనికి రావాలంటే హింసాప్రవృత్తిలోనికి వెళ్ళవద్దు.

ఎదుటివారు విమర్శించినపుడు మనకు కంగారువస్తే ఆత్మ విశ్వాసములేదు అని అర్థము. గాలికి చెట్లు కదులుతూ ఉంటాయి గాని ఎంత గాలి వీసినా కొండ కదలదు. గాలికి మధ్య కొండ ఎలా ఉంటుందో అలాగ ఆత్మవిశ్వాసము ఉన్నమనిషి పరిస్థితులు తనకు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేకంగా ఉన్నా అంత అచలముగా ఉంటాడు. ఆత్మవిశ్వాసములేని మనిషికి జ్ఞానం వచ్చే ప్రసక్తే లేదు.

మాట్లాడేమాటలో, చేసేపనిలో, ఆలోచనలో పవిత్రత ఉండాలి. పవిత్రత అనే గుణంలేకపోతే జీవలక్షణాలు నాశనంకావు. మనుషులను రెండుభాగములుగా చేయవచ్చును. కొంతమంది చెప్పటంతోనే సరిపెడతారు పనిచేయరు. ఇటువంటివారు ఏమీ సాధించలేరు. కొంతమంది ఏమీచెప్పరు. చేయవలసిన పనిని మౌనంగా చేస్తారు. ఇటువంటివారికి ఈశ్వరానుగ్రహం వస్తుంది.

దేవతానుగ్రహము కావాలంటే ఎదుటివారితో మాట్లాడేటప్పుడు సహృదయంతో మాట్లాడాలి. చేయగలిగితే సహాయం చేయాలి లేనిచో మౌనంగా ఉండాలి. ఇతరులను హింసపెట్టకుండా ఉండాలి, ఇతరులపట్ల అసూయ లేకుండా ఉండాలి వీటివలన పూజలు, యాగాలు చేసిన దానికంటే ఎక్కువ దేవతానుగ్రహం వస్తుంది ఎదుటివ్యక్తిని గౌరవించి ఆప్యాయంగా మాట్లాడటం వలన కూడా దేవతానుగ్రహం పొందవచ్చును. ఎందుకంటే జీవుడుగా వ్యక్తమయినవాడు శివుడే. శివుడు లేకుండా జీవుడులేడు. అందువలన జీవునిలోని శివుని చూస్తూ వారు ఎటువంటివారు అయినావారిని గౌరవించటంవలన మనం దేవతానుగ్రహం పొందవచ్చును. ఇతరులను గౌరవించి. ప్రేమించి వారికి విషయం అర్థమయ్యేలా చెప్పటంవలన నీవు యజ్ఞాలు, యాగాలు చేయలేకపోయినా సమస్త దేవతల అనుగ్రహం నీకు కలుగుతుంది అని చెపుతున్నారు.

బ్రహ్మానుభవం కలగటం కోసం పవిత్రత, ఏకాగ్రత అవసరము. ఉపాసన వలన పవిత్రత, ఏకాగ్రత వస్తాయి. మనిషియొక్క ఇంద్రియాలకు చాపల్యం ఉంటుంది. దేవుని రూపమును తీసుకొని ఆరాధించటంవలన మనిషియొక్క ఇంద్రియాలకు చాపల్యము తగ్గుతుంది. నీకు ఇష్టమైన దేవతారూపమును తీసుకొని ధ్యానం చెయ్యి. ఇవి అన్నీ సూక్ష్మదేహం నశించటానికే. ఉన్నది ఒకటే వస్తువు. అది బ్రహ్మము. (ఒక్క బ్రహ్మము తప్ప ఈ సృష్టిలో నీకు ఏది కనిపించినా అది ఎండమావులలో నీరు లాంటిది అన్నారు ఆచార్యులవారు.)

మనం అజ్ఞానముఅనే నిద్రలో ఉన్నాము. అందులో ఈ జీవితము ఒక సంఘటన మాత్రమే. ఇక్కడితో ముగిసిపోయింది అని అనుకోవద్దు. మరణించిన తరువాత మరల జన్మవస్తుంది. అక్కడ నుండి ఇంకో

సంఘటన మొదలవుతుంది. అజ్ఞానము అనే నిద్రలో ఈ జీవితము ఒక సంఘటన మాత్రమే అంతకన్న ప్రాముఖ్యత లేదు.

సిరిమంచిదే కాని సిరికంటే శీలము మంచిది. సిరికోసం శీలమును పోగొట్టుకోవద్దు అని చెప్పారు. సిరి మరణం వరకు ఉంటుంది. కాని శీలము మరణానంతరము నీ కూడా వస్తుంది. బ్రహ్మాను భవం కలగటానికి సిరికంటే శీలము బాగా నీకు సహకరిస్తుంది. అందువలన శీలమునకు ప్రాముఖ్యత ఇవ్వాలి.

నీలో అన్ని మంచి గుణాలు లేకపోవచ్చు. నీలో కొన్ని మంచి గుణాలు ఉన్నా వాటిని జాగ్రత్తగా కాపాడుకో. ఎందుకంటే అవి బ్రహ్మానుభవం కలగటానికి నీకు సహకరిస్తాయి. అందువలన మీలో ఉన్న మంచిగుణాలను కాపాడుకోండి అని ఆచార్యులవారు చెపుతున్నారు.

వేదంలో చెప్పిన మాటలు, భగవద్గీతలో చెప్పిన మాటలు, బ్రహ్మానుభవంకలిగినవారు చెప్పినమాటలు శ్రవణంచేయండి. మననం చేసుకోండి. మీరు బట్టల విషయంలో తీసుకొనే జాగ్రత్త స్నేహం విషయంలో, పుస్తకాల విషయంలో తీసుకోవటం లేదు. స్నేహం విషయంలో, పుస్తకాల విషయంలో జాగ్రత్త అవసరము. శాస్త్రమును జాగ్రత్తగా శ్రవణంచేయండి. అది అర్థం అవ్వాలి. అర్థం అయితే దాని రుచి మనకు తెలుస్తుంది. అర్థం అయినపుడు అది మన గుండెను పట్టుకొని పీకుతుంది. శాస్త్రమును విడిచిపెట్టవద్దు. అది మార్గమును చూపిస్తుంది. కాని విచారణ చేయవలసింది అంతా లోపలే. శాస్త్రములు, పంచభూతములు, ప్రకృతి, తల్లితండ్రులు, స్నేహితులు అంతా మనకు బయట ఉన్నాయి. కాని సద్వస్తువు మనలోపల ఉంది. అది అనుభవంలోనికి వచ్చినపుడు ఇవి అన్నీ మిథ్య అని తెలుస్తుంది.

గాఢ నిద్రలో మనం ఒక్కరమే ఉన్నాము. గాఢ నిద్రలో దేవతలగొడవ, పంచభూతముల గొడవ, శాస్త్రములగొడవ, పునర్జన్మ గొడవ, దేహం గొడవ ఏ గొడవా లేదు. ఉన్నదేదో ఒకటే వస్తువు ఉంది. అది ఒక్కటే నిజమైన స్థితి, సహజస్థితి, అందమైన స్థితి. ఆ స్థితిని ప్రయత్నంచేసి జాగ్రదావస్థలోనికి తెచ్చుకుంటే అది కడసారి జన్మఅంటున్నారు భగవాన్. దేవతలు లేరా అంటే ఉన్నారు. నీ మనస్సు ఎంత నిజమో దేవతలు కూడా అంతే నిజము. మన సాధనకు వారి అనుగ్రహం కావాలి. మనం బ్రహ్మానుభవం పొందటానికి వారి సహకారం కావాలి.

అహంకారము వలన అశాంతి వస్తుంది, ఆందోళన వస్తుంది. ఆత్మను తెలుసుకొన్నప్పుడు శాంతివస్తుంది, ఆనందము వస్తుంది. ఎందుకంటే ఆత్మలో ఉన్నది శాంతి, ఆనందము. అందువలన ఏది కావాలో మీ వివేకమును ఉపయోగించి ఆలోచించుకోండి. ఏ గురువూ మిమ్మలను బలవంతపెట్టడు. వారికి బాహ్యమైన వాంఛలు లేవు. ఏదో ఆశించి చెప్పిన మాటలు కావు. కేవలము లోకమును అనుగ్రహించాలి అని చెప్పిన మాటలు ఇవి. వారు లోకం దగ్గరనుండి ఆశించేది ఏమీ లేదు.

కొంతమందికి కుదురు ఉండదు. పనిలేకుండా శరీరమును అటూఇటూ త్రిప్పుతూ ఉంటారు. ఇంద్రియాలను అటూ ఇటూ త్రిప్పుతూ ఉంటారు. చాపల్యంగా ఉంటారు. ధ్యానం వలన చాపల్యము తగ్గుతుంది అని ఆచార్యులవారు చెపుతున్నారు. మీకు ఇష్టమైన దేవతా రూపమును తీసుకొని ధ్యానం చెయ్యండి ఏ రూపమును ఆరాధించినా మనస్సు యొక్క చాపల్యము తగ్గటం ముఖ్యం. ఏ రూపమును ఆరాధించినా అనుగ్రహించేవాడు పరమేశ్వరుడే.

చనిపోవటం అంటే కంగారు పడవద్దు. పాత శరీరము పోతుంది, పేరు పోతుంది అంతే. మరల కొత్త శరీరము వస్తుంది, కొత్త పేరు వస్తుంది. చనిపోవటం వలన గుణాలు మారవు, వాసనలు మారవు ఇవి సాధన చేసి పోగొట్టుకోవాలి. చనిపోవటం వలన పోవు.

శ్రవణము, మననము, ధ్యానము, దేవతానుగ్రహం ఈ విషయములన్నీ ఎందుకంటే మీ హృదయంలో ఉన్న సద్వస్తువును మీ అనుభవంలోనికి తెచ్చుకోవటానికే. ఇవి అన్నీ బాహ్యమైన మాటలే. మీ హృదయంలో ఒక అమృతస్థితి ఉంది, ఆనందస్థితి ఉంది. మీరు శ్రవణం చేయకపోతే, మననం చేయకపోతే, ధ్యానం చేయకపోతే, మీలో మంచి గుణాలు లేకపోతే ఆ వస్తువు మీకు అందదు. ఆ వస్తువు మీ చేతికి అందితేనేగాని మీరు ప్రకృతిని దాటి వెళ్ళలేరు. ఈ చీకటిని దాటి వెలుగులోనికి రాలేరు. చీకటిలో ఉన్న మనిషికి ఏమీ కనబడదు. అలాగే అజ్ఞానంలో ఉన్నంతసేపు మనకు ఏమీ తెలియదు. మోక్ష కాంక్ష బలీయంగా ఉంటే ప్రకృతి గోడవలు అన్నీ మీ ప్రయత్నం లేకుండానే సన్నగిల్లిపోతాయి. అంటున్నారు ఆచార్యులవారు. విషయచింతన పెరుగుతూ ఉంటే అజ్ఞానము పెరుగుతూ ఉంటుంది. ఆత్మచింతన పెరుగుతూ ఉంటే జ్ఞానము పెరుగుతుంది.

భగవంతుడు మీకు సద్బుద్ధిని కలుగజేసి శబ్ధంను సరిగా ఉన్నది ఉన్నట్లు అర్థం చేసుకొనే శక్తివస్తే ఎప్పుడో ఎక్కడో కాదు ఇప్పుడే ఇక్కడే ఆ వస్తువు మీకు అనుభవంలోనికి వస్తుంది. శబ్ధం సరిగా అర్థం కావాలి. విపరీతార్థములు తీయకూడదు. సరిగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తే ఆ వస్తువు ఇప్పుడే మీకు అనుభవంలోనికి వస్తుంది అని ఆచార్యులవారు వాగ్దానం చేస్తున్నారు. అవగాహనకు అంత విలువ ఇచ్చి చెపుతున్నారు.

విషయస్మరణ వలన మనస్సు బాహ్యముఖమునకు వస్తుంది. మనిషి చెడిపోవటానికి అన్ని ఇంద్రియాలకు లోబడనక్కరలేదు. ఏ ఒక్క ఇంద్రియానికి లోబడినా మనిషి పాడైపోతాడు. మోక్షముమీద ఆపేక్ష పెరిగితే జ్ఞానంను సంపాదించాలి అనే ఆకాంక్ష పెరుగుతూ ఉంటే ఇంద్రియాలు విషయాల మీద వాలటం తగ్గిపోతుంది అంటున్నారు ఆచార్యులవారు. జ్ఞానమును సంపాదించాలి అనే ఆకాంక్ష పెరిగినపుడు మనస్సు, ఇంద్రియాలు బాహ్యముఖంగా విజృంభించటం తగ్గిపోతుంది.

జ్ఞాపకం కూడా వెనుకకు తీసుకొని పోతుంది. మీకు సినిమా చూసే అలవాటు ఉంది అనుకోండి దీనికి సంబంధించిన జ్ఞాపకం మీ మనస్సులోనికి వస్తే మీరు ఇక్కడ రమణ క్షేత్రంలో కూర్చున్నా ఆ జ్ఞాపకం మీ మనస్సును సినిమా హాలులోనికి తీసుకొనిపోతుంది. మీ మనస్సుకు జ్ఞాపకం రాకుండా చేస్తుంది మోక్షాపేక్ష అంటున్నారు ఆచార్యులవారు. మీలో బలహీనతలు ఏమి ఉన్నాయో చూసుకొని వాటిని తొలగించుకొనే విధానం చూసుకోండి. ఇప్పుడు నీకు తెలియకుండానే నీ మనస్సు విషయాల మీదకు వెళుతోంది. ఇప్పుడు నీ మనస్సు విషయములమీదకు ఎంత సహజముగా వెళుతోందో అంత సహజముగా హృదయంలో ఉన్న ఈశ్వరుని దగ్గరకు వెళితే ఈ జన్మలోనే జ్ఞానం కలుగుతుంది అంటున్నారు. నీ ప్రయత్నం ద్వారా మనస్సును హృదయంలోనికి పంపటం కాదు. నీ మనస్సు సహజముగానే హృదయంలోనికి వెళ్ళాలి.

దేవునిగురించి ఆచార్యులవారు చెప్పిన మాటలు.....

కాశీలో ఉన్న వాడు దేవుడు, అరుణాచలంలో ఉన్న వాడు దేవుడు అని చెప్పటంలేదు. భగవంతుడు అంటే

నిజమైన స్నేహితుడు. నిజమైన స్నేహితుడు మన క్షేమమును ఎలాకోరుతూ ఉంటాడో అలాగ భగవంతుడు ఎప్పుడూ నీ క్షేమమును కోరుకొంటూ ఉంటాడు. వాడే దేవుడు. అలా కోరకపోతే వాడు దేవుడే కాదు అంటున్నారు ఆచార్యులవారు. అందరికీ మంచినే చెపుతాడు. విన్నవాడు వికాసము ఉన్నలోకము లోనికి వెళతాడు. విననివాడు మాత్రము చీకటి లోకము లోనికి వెళతాడు. విన్నవాడు బాగుపడతాడు. వినని వాడు చెడిపోతాడు. ఆయన మాత్రం ప్రేమతో చెపుతాడు. అందరి క్షేమమును కోరుకొంటాడు. ఆయనకు పక్షపాతము అంటగట్టనక్కరలేదు. రవ్వంత, ముల్లంత స్వార్థం లేకుండా అందరి క్షేమమును కోరతాడు. అందరినీ ప్రేమిస్తాడు. ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రేమిస్తాడు. ప్రేమించటమేకాదు అందరి హృదయములలో సమానంగా ఉంటాడు. కొందరి హృదయములలో ఎక్కువగా, కొందరి హృదయములలో తక్కువగా ఉండడు. అందరి హృదయములలో సమానంగా ఉంటాడు. వాడు దేవుడు. అంతేకాదు నీ ఆలోచనలను, ఊహాలను, నీవుచేసే పనులను, నీ మనస్సులోని కోరికలను అన్నింటినీ చూస్తూ ఉంటాడు. ఇతరులకు తెలియకుండా నీ మనస్సులో పొడచూపే కోరికలను కూడా చూస్తూ ఉంటాడు. వీటి నన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నీకు కర్మ ఫలితాన్ని ఇచ్చేవాడుదేవుడు.

మీరు బాహ్యంగా చేసే పనులను ఆయన చూడడు. ఏ కోరికతో చేస్తున్నారో ఆయన చూస్తాడు. గౌరవాన్ని ఆశిస్తున్నారా అని చూస్తాడు. గౌరవాలు అన్నీ ఆవిరిలాంటివి. గౌరవం వస్తే మాత్రము ఎంత సేపు ఉంటుంది. లోతైన ఆలోచనలు ఉన్న వాడు వీటికోసం ప్రాకులాడడు. ఎవడికైతే నిత్య, అనిత్య వస్తువివేకము ఉందో వాడు అప్రధానమైన విషయములకూడా పరుగెత్తడు. ఏది ప్రధానమైనదో దానిని పట్టుకుంటాడు.

ఏ జీవుడికి ఎప్పుడు ఏ ఫలితమును ఇవ్వాలో ఆయన చూసుకొంటూ ఉంటాడు. వాడు దేవుడు. నీవు చేసే పనులన్నింటికి సాక్షిగా ఉంటాడు. మీరు దయాగుణంతో ఏదైనా పనిచేస్తే ఆ పనికి కూడా సాక్షిగా ఉంటాడు. మీ దయాగుణమును కూడా దృష్టిలో పెట్టుకొని ఫలితమును ఇస్తాడు. లోకం మిమ్మలను గౌరవించనక్కరలేదు. దేవుడు అంటే సర్వజ్ఞుడు. ఆయనకు తెలియనిది అంటూ ఏదీ లేదు. ఆయన విధిని నిర్ణయిస్తాడు. జీవులను వారివారి ప్రారబ్దము ననుసరించి కంట్రోల్ చేస్తూ ఉంటాడు. నిన్ను నియమించేవాడు నీ హృదయంలోనే ఉన్నాడు. నీ హృదయంలో ఉండి నీ ప్రారబ్దముననుసరించి నియమిస్తున్నాడు. అంతా ఆయన నియమానుసారం నడుస్తుంది. దానిని నీవు ఉల్లంఘించలేవు. అది ఈశ్వరాజ్ఞ. వాడే దేవుడు. నీకు జ్ఞానం కావాలంటే వాడిని పట్టుకొని వేలాడు అంటున్నారు ఆచార్యులవారు. ఎప్పుడైతే వాడిని పట్టుకొన్నావో వాడు నీ ప్రారబ్ధమును కూడా దాటించి నిన్ను బయటకు తీసుకొని పోతాడు. ప్రారబ్దమును బట్టి దేహంవచ్చింది కదా ప్రారబ్దమును అనుభవించాలి అని అందరూ చెపుతారు. ఆచార్యుల వారు ఏమిచెపుతున్నారు అంటే నీకు దేహబుద్ధి ఉన్నప్పుడు కదా దేహ ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అనిపిస్తుంది. ఈశ్వరునికి నీ పట్ల అనుగ్రహం ఎప్పుడైతే కలిగిందో నీ దేహబుద్ధిని తీసేస్తాడు. దేహబుద్ధిని తీసివేసినపుడు దేహ ప్రారబ్దము అంటూ ఏదీ లేదు. ఈశ్వరుని ఆశ్రయించినపుడు నీ దేహబుద్ధిని తీసివేసి నిన్ను ఆత్మ సింహాసనము మీద కూర్చోబెడతాడు. ఆయన నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయన అనుగ్రహంకోసమే నీ జీవితంలో పనిచెయ్యి. ఆయన అనుగ్రహంకోసమే ఆలోచించు అని ఆచార్యులవారు మనకు హితవు చెపుతున్నారు. మనం వింటామా లేదా అన్నది వేరే విషయం. మన మీద ప్రేమతో చెపుతున్నారు. మన దగ్గర నుండి ఏదో ఆశించి చెప్పిన మాటలుకాదు. మన మీద కరుణ కలిగి చెపుతున్న మాటలు. ఈ ప్రపంచము మిథ్య అన్న సంగతి వారికి తెలుసు. ఈ ప్రపంచము నుండి ఆశించేది ఏదీ లేదు. మనలను తరింపజేయాలనే కాంక్ష తప్పించి మరొక

ప్రయోజనం వారి మాటలకు లేనేలేదు.

భగవంతుని ఎప్పుడైతే ధ్యానం చేస్తున్నామో అప్పుడు ఆయన అనుగ్రహించి ఆయనదగ్గర ఉన్న జ్ఞానమును మనకు ప్రసాదిస్తాడు. భగవంతుడు అనుగ్రహించి ఆయన దగ్గర ఉన్న శక్తిని, శాంతిని ఇస్తే మనం పుచ్చుకోవటానికి సరిపోతాముగాని ఆయన శక్తిని మనకు ఇవ్వకపోతే మనం పుచ్చుకోవటానికి ఎక్కడ సరిపోతాము. తాత్కాలికమైన ప్రయోజనములు ఆశించకుండా, అవిరిలాంటి గౌరవాలకోసం కాకుండా కేవలం ఆయన అనుగ్రహం కోసం పనులు చేస్తే ఆయన దగ్గర శక్తిని, ఆనందమును నీకు సంక్రమింపజేస్తాడు. వాడు దేవుడు అంటున్నారు ఆచార్యులవారు. కాలమును, జీవులను కంట్రోల్ చేసేవాడు ఆయనే.

ప్రకృతి జీవితంలో సారంలేదు. ప్రకృతి జీవితంలో ఉన్న నిస్సారతను ఎవడైతే గ్రహించాడో వాడు మాత్రమే భగవంతుని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేస్తాడు కాని మిగిలిన వారు పనికిరారు అంటున్నారు ఆచార్యులవారు. లోకంలో ఏదో ఉంది బ్రతికి ఉండగానే దానిని అనుభవించాలి అనుకొనేవారు ఏమీచేయలేరు. ఈశరీరమునకు మరణం రావటం ఎంత నిజమో మరల కొత్త శరీరము రావటం కూడా అంతే నిజము మరల ఆశరీరము కొంతకాలము ఉండి మరణించటం కూడా అంతే నిజము. ఈ జనన మరణ చక్రములోని నిస్సారత నీకు అర్థమయినపుడు గాని నీ మనస్సు మోక్షం వైపుకు తిరగదు.

(మానవజన్మ ఎత్తికూడా ఎవడైతే భగవదనుభవంకోసం ప్రయత్నం చేయడో వాడిని చూసి జాలి పడాలి అన్నారు ఆచార్యులవారు.)

ప్రకృతి విషయాల మీద ఎప్పుడైతే నీకు వైరాగ్యము కలిగిందో అప్పుడు భగవంతుని తెలుసుకోవటానికి అర్హత సంపాదించగలవు. అప్పుడు నీకు యోగ్యత కలుగుతుంది. నీ అర్హతను బట్టి, యోగ్యతను బట్టి భగవంతుడు తన స్వరూపమును తెలియజేస్తాడు. జ్ఞానంరాలేదు అని కంగారు పడవద్దు. ముందు నీవు అర్హతను సంపాదించుకో. అసలు చదవకుండా ఉద్యోగం రాలేదు అనుకోవటం ఎలా ఉందో మనపని అలా ఉంది అంటున్నారు ఆచార్యులవారు. నీవు కొంత అర్హతను సంపాదించు. యోగ్యతను సంపాదించు. అవి లేకుండా భగవదనుభవం రావటంలేదు అంటే ఏమి లాభం అంటున్నారు. నీకు దయాగుణంలేదు, త్యాగంలేదు, భగవంతుని మాటలయందు గౌరవంలేదు. ఇలా ఉండి నాకు జ్ఞానంరాలేదు అంటే అర్థం ఏమిటి అంటున్నారు ఆచార్యులవారు. ముందు అర్హతను సంపాదించు. అందం అనేది బయటలేదు. అందం అనేది మన అంతరంగములో ఉంది. హృదయం యొక్క లోతులలోనికి దిగుతూ ఉంటే దేవుడు మాట అటు ఉంచండి ఎన్నో అందాలుమనకుగోచరిస్తాయి. ఆ అందాలు చూడటానికి మన రెండుకళ్ళూ సరిపోవు. అటువంటి అనుభవాలు మనం పొందవచ్చును. ఇన్ని అందాలు ఉన్నాయా అని మనకు అనిపిస్తుంది.

ఇంటిలో ఉన్న బంగారమును పొయ్యిలో పెట్టి కాఫీ కాసుకోవటం ఎలాగ ఉంటుందో మానవజన్మను భగవదనుభవంకోసం కాకుండా చిల్లర విషయాలకు ఉపయోగించుకోవటం అలాగ ఉంటుంది. భగవంతుడు అతి సన్నిహితంగా మన హృదయంలో ఉన్నప్పటికీ కేవలము మన భ్రాంతి వలన మనకు ఆయన గురించి తెలియటంలేదు అంటున్నారు ఆచార్యులవారు. ఆయన గురించి తెలియటంలేదు. కాబట్టి భగవంతుడులేడు అని అంటున్నావు. ఇది ఎంత దురదృష్టకరము. దేవుడు ఎక్కడో దూరాన లేడు. నీ స్వరూపముగానే ఉన్నాడు.

సామాన్య మానవునిగురించి ఆచార్యులవారు చెప్పిన మాటలు.....

సామాన్య మానవుడు ప్రతీవాడు భ్రాంతిలోనే ఉంటాడు. అజ్ఞానంలోనే ఉంటాడు. ఎవరో కొద్దిమంది మాత్రము గొప్ప గురువులు దొరికి, మహాత్ముల ఆశ్రయం దొరికి మోక్షమును సంపాదించాలనే కోరిక కలిగి తరిస్తారుగాని సామాన్య మానవులు అందరూ భ్రాంతిలోనే ఉంటారు. సామాన్యమానవుడు రాగద్వేషముల చేతిలో బందీగా ఉంటాడు. రాగద్వేషములు ఏది చేయమంటే అది చేస్తూ ఉంటాడు. వాడు స్వతంత్రుడు కాదు. మనకు జ్ఞానమురాకుండా ఏరాగద్వేషములు అయితే అడ్డువస్తున్నాయో వాటిని పోషించుకొంటూ ఉంటాడు. హృదయంలో ఉన్న ఈశ్వరవాణి వాడికి అక్కరలేదు. భగవంతుడు ఈ పని చేయమని చెప్పాడు అందువలన ఈ పనిని చేద్దాము. భగవంతుడు ఆ పనిని చేయవద్దని చెప్పాడు అందువలన మానివేద్దాము అని చూడడు. వాడికి కావలసినది భగవంతుని మాటకాదు. వాడి రాగద్వేషములు ఎలా చెపితే అలాచేస్తూ ఉంటాడు. భగవంతుడు ఇలా చెప్పాడు అని ఆలోచించడు. ఎందుకంటే వాడికి ఉన్న రాగద్వేషములు భగవంతుని మాటలగురించి ఆలోచింపనీయవు. వాడు ఏమి చేస్తాడు. వాడు రాగ ద్వేషములు అనేజైలులో ఉన్నాడు. రాగద్వేషముల చేతిలో బందీగా ఉన్నాడు.

సామాన్య మానవునికి మూడ్సు ఉంటాయి. ఏ గంటలో ఎలా మాట్లాడతాడో తెలియదు. ఈ మాట మాట్లాడాలా, మాట్లాడకూడదా అనే వివేకము ఉండదు. వివేకము ఆధారంగా చేసుకొని మాట్లాడడు. వాడి మూడ్సును బట్టి మాట్లాడతాడు. సామాన్య మానవుని లక్షణాలు ఇలా ఉంటాయి. మనం వచ్చిన పని ఏమిటి? సమాజంపట్ల మన బాధ్యత ఏమిటి? అనే ఆలోచన సామాన్య మానవునికి రాదు.

కొంత మంది మాత్రము పూర్వజన్మలో చేసిన కృషినిబట్టి, తపస్సును బట్టి, సాధనను బట్టి పుట్టుకతోనే వివేకముతోటి, వైరాగ్యముతోటి, తెలివితోటి పుడతారు. పూర్వజన్మలో చేసిన కృషిని బట్టి నిత్య, అనిత్యవస్తు వివేకము కొంతమందికి పుట్టుకతోనే వస్తుంది. పూర్వదేహములు జ్ఞాపకం లేకపోయినా పూర్వదేహములో చేసిన పనుల వలన ఏర్పడిన సంస్కారములను బట్టి ఈ దేహంలో మనం పనిచేస్తాము. కొంతమంది స్వార్థంతో పనిచేస్తారు ఇతరుల గురించి ఆలోచనే వారికి ఉండదు కొంతమంది ఇతరులకోసం పనిచేస్తారు. స్వార్థం చూసుకోరు. ఇదికూడా పూర్వజన్మ సంస్కారమును బట్టి వస్తుంది.

భగవంతుడు కామ్య కర్మలను చేయవద్దని చెపుతున్నాడు. కామ్య కర్మ నిన్ను బంధిస్తుంది. కామ్యకర్మవలన అజ్ఞానము పెరుగుతుంది. అందువలన నిష్కామకర్మను చేయమని భగవంతుడు చెపుతున్నాడు. నిష్కామకర్మవలన అజ్ఞానం తగ్గుతుంది.

(నీవు ఏ మార్గములో ప్రయాణంచేసినా ఆత్మజ్ఞానం కలుగకపోతే మోక్షం రానేరాదు అంటున్నారు. ఇక్కడ ఏమీరాజీ పడటంలేదు ఆచార్యులవారు.)

ప్రాపంచిక సంబంధమైన ఏ కోరికవచ్చినా మనకు అహంకారము ఉన్నట్లు గుర్తు. అహంకారము అంటే కోపం అని అనుకోవద్దు. కోపం వస్తూ ఉంటే వారికి అహంకారము ఉంది అని చాలామంది అనుకొంటూ ఉంటారు. అలాకాదు. అహంకారము అనేది విత్తనము. కోరికలు, గొప్పలు, గొడవలు ఇవి అన్నీ రొబ్బలవంటివి. బాహ్యమైన కోరికలు తొలగించుకొన్నప్పటికీ అహంకారము అనే విత్తనమును తొలగించు కోకపోతే దానికి అనుకూల పరిస్థితులు వచ్చినపుడు మొలిచే ప్రమాదము ఉంది. మరల జన్మలు వచ్చే అవకాశము ఉంది అంటున్నారు ఆచార్యులవారు.

సామాన్య మానవుడు మాటఎలా ఉన్నా తెలివైన వాళ్ళు కూడా ఇది అంతా నేనే చేస్తున్నాను, నావలనే అవుతోంది అనుకొంటాడు ఇది అంతా ఈశ్వరకృప వలన జరుగుతోంది. దీనికి కర్త ఈశ్వరుడు అనే భావన తెలివైనవాడికి కూడారాదు. ఇదే మాయ. లోపల అనుభవం లేనందువలన వాడికి ఇలా అనిపిస్తుంది అంటున్నారు ఆచార్యులవారు.

సామాన్య మానవుడు ఎప్పుడూ దేహమును కేంద్రముగా పెట్టుకొని జీవిస్తూ ఉంటాడు. ఎప్పుడూ వాడిని వాడు పొగడుకొంటాడు. ఎదుటి వాడిని నిందిస్తూ ఉంటాడు. ఇవి రెండూ తప్ప మూడో మాట వాడికి రాదు. ఇతరులు సాధించినది తానే సాధించాను అని చెపుతూ ఉంటాడు. మానవులోని బలహీనతలు మానవ మనస్సులో ఉన్న ఇరుకు గురించి వివరంగా చెపుతున్నారు. మనం ఈ ప్రమాదంలో పడకుండా ఉండటంకోసం మన పేర్లు చెప్పకుండా సామాన్య మానవుని లక్షణాలు ఇవి అని ఆచార్యులవారు చెపుతున్నారు.

సామాన్య మానవునికి దేహబుద్ధి ఎక్కువగా ఉంటుంది పశుబుద్ధి ఉంటుందిగాని శివ బుద్ధి వాడికి ఉండదు. ఎవరైనా మంచిమాటలు చెప్పినా వాడిలో ఉన్న పాపము వాడిని విననివ్వదు ఏదోపని చేయటం, దాని ఫలితం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. ఈతకాయ ఇవ్వటం, ఎదుటివాడు కొబ్బరికాయ ఎప్పుడు ఇస్తాడా అని ఎదురుచూడటం. వాడిలో ఉన్న పశు బుద్ధి వలన ఇలా అనిపిస్తుంది.

దేహం చేసేపని, ఇంద్రియాలు చేసేపని, మనస్సు చేసేపని నేనే చేసాను అనుకొంటాడు. ఇవి అన్నీ తన మీద పెట్టుకుంటాడు. వాడు ఆత్మ అన్న సంగతి మరచిపోయాడు. దేహముతో చేసినపని, మనస్సుతో చేసినపని నామీద పెట్టుకుంటున్నాను అనే అవగాహన వాడికి లేదు కాబట్టి ఈ సంసార చక్రము నుండి బయటు పడే అవకాశములేదు అంటున్నారు ఆచార్యులవారు.

ఇప్పుడు మనం చెప్పుకొనేది దేవుని రాజ్యాంగము. దీనిని తూచా తప్పకుండా ఎవరైతే అనుసరించాడో వాడు మోక్షమును పొందుతాడు. భగవంతుని స్వరూపమును పొందుతాడు. వాసన రెండుపనులు చేస్తూ ఉంటుంది. లోపల అహంకారమును పెంచుతూ ఉంటుంది. బయట కోరిక రూపములో విజృంభిస్తూ ఉంటుంది. వాసన మనలో లేకుండా ఉండాలిగాని ఉంటే అది ఎప్పుడు విజృంభిస్తుందో చెప్పలేము.

ఆత్మ అంతటా ఉంది. ఆనందముగా ఉంది. దానికి వికారములులేవు. చైతన్య వంతముగా ఉంది. అటువంటి ఆత్మ తానై ఉండికూడా అది వాడికి తెలియక దేహముతో చేసిన పెంట అంతా తను చేసాను అని అనుకొంటూ ఉంటాడు. ఏది నిత్యము, ఏది అనిత్యము అని విచక్షణచేసే బుద్ధి నీకు లేనందువలన నీ గమ్యం ఏమిటో నీకు తెలియటంలేదు. నీ బుద్ధికి యోగ్యత లేనందువలన నీవు విచక్షణ చేసే శక్తిని కోల్పోతున్నావు. అందువలన జ్ఞానమును పొందటానికి అర్హత పొందలేకపోతున్నావు. మానవుని జీవిత లక్ష్యం మోక్షమును సంపాదించటం అయినప్పటికీ నీ బుద్ధిలో ఉన్న దోషమువలన మోక్షమును సంపాదించాలి అనే కాంక్ష నీకు కలగటం లేదు.

నీ బుద్ధిలో దోషములు ఉన్నప్పటికీ, పాపములు ఉన్నప్పటికీ నేనే దిక్కు అని నమ్మి, నా మాట యందు గౌరవము కలిగి నన్నే ఆశ్రయిస్తే, నన్నే భక్తితో సేవిస్తూ ఉంటే, నా కిష్టమైన పనులు చేస్తూ ఉంటే నీకు ఎటువంటి బుద్ధిని ఇస్తే జ్ఞానము కలుగుతుందో అటువంటి బుద్ధిని ప్రసాదిస్తాను అని కృష్ణుడు గీతలో చెప్పాడు.